# కొత్తపేట పంచాయతీని
# ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యం..

**-ఆరు నెలల్లో రూ.5 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి.**
**-త్వరలో మరిన్ని భారీ అభివృద్ధి కార్యక్రమాలు.**
**-గ్రామ అభివృద్ధి మరో 6 కోట్ల పనులు ఆమోదం లభించే అవకాశం.**
**-గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం..**
**-సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్.**




**బయ్యారం/,జూన్ 27.(జర్నలిస్ట్ వార్త)** కొత్తపేట గ్రామపంచాయతీ పాలకవర్గం ఏర్పడి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా గ్రామ అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనులు,రానున్న రోజుల్లో చేపట్టనున్న కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ గడిచిన ఆరు నెలల్లో గ్రామంలో రూ. 2.50 కోట్లతో నూతన వసతుల నిర్మాణం, రూ. 25 లక్షలతో చెరువు అభివృద్ధి, రూ. 2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం,అతి త్వరలో రూ. 50 లక్షలతో దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సుమారు రూ. 5 కోట్ల విలువైన అభివృద్ధి పనులను విజయవంతంగా పూర్తి చేశామని, గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ఇటీవల గ్రామానికి విచ్చేసిన మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కి గ్రామ అభివృద్ధి కోసం రూ. 6 కోట్ల అంచనాలతో ఎస్టిమేట్ ప్రతిపాదనలు అందజేశామని,వాటికి కూడా త్వరలోనే ఆమోదం లభించే దిశగా సానుకూల స్పందన ఉందని పేర్కొన్నారు. గ్రామంలో శాంతిభద్రతలు, ప్రజల భాగస్వామ్యంతో సాగుతున్న అభివృద్ధిని గుర్తిస్తూ జిల్లా ఎస్పీ శబరిష్ స్వయంగా గ్రామాన్ని సందర్శించి,సీసీ కెమెరాల ఏర్పాటును అభినందించడంతో పాటు గంజాయి రహిత గ్రామంగా కొనసాగుతున్న గంధంపల్లికొత్తపేటను ప్రశంసించడం గ్రామానికి గర్వకారణమని అన్నారు. ఇంకా గ్రామంలో శ్రీ శక్తి నూతన భవనం,అంగన్‌వాడీ నూతన భవనం, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి,ప్రతి వీధిలో సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ కోతుల బెడదను తగ్గించేందుకు స్వయంగా మంకీ మాస్కులు ధరించి కోతులను పట్టే కార్యక్రమాన్ని నిర్వహించడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. గ్రామ ప్రజల సహకారం,ప్రజాప్రతినిధుల మద్దతుతో గంధంపల్లికొత్తపేటను జిల్లాలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ గారు స్పష్టం చేశారు. అనంతరం గ్రామ అభివృద్ధికి నిరంతరం




సహకరిస్తున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చిత్రపటానికి గ్రామ పాలకవర్గ సభ్యులు,నాయకులు పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం,రాజకీయ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు మేధావులు, విద్యావంతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏకలవ్య పాఠశాలలో
# విద్యార్థులకు నీటి కష్టాలు...!

**-మూడు రోజులకు ఒకసారి విద్యార్థుల స్నానం. -పట్టించుకోని అధికారులు..!**




**బయ్యారం/,జూన్ 27.(జర్నలిస్ట్ వార్త)** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో విద్యార్థుల భవిష్యత్తు కోసం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వారి విద్యాభ్యాసాన్ని అందించేందుకు కృషిచేసిన విద్యార్థులకు అందని ద్రాక్షలా మారింది. వివరాల్లోనికి వెళితే మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని నామాలపాడు గ్రామములో తెలంగాణ ప్రభుత్వం సుమారుగా 10 కోట్ల రూపాయలు వెచ్చించి ఏకలవ్య రెసిడెన్షియల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ఏర్పాటు చేశారు. పాఠశాల నిర్మాణం నుండి నేటి వరకు విద్యార్థులకు సరైన నీటి సదుపాయం లేక అనేక అవస్థలు పడుతున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. 2025- 26 సంవత్సరానికి గాను పాఠశాల ప్రారంభమైన పాఠశాలలో విద్యార్థులు సుమారు 300 నుంచి 400 వరకు అడ్మిషన్లు తీసుకున్నట్లు సమాచారం. పాఠశాలలో కనీస వసతులైన నీరు లేక విద్యార్థులు పాఠశాలలో చేరేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు ఉదయం లేవగానే కాల కృత్యాలు, స్నాన,పానీయాలు అవసరం ఉంటాయి. అదే విధంగా రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఉదయం టిఫిన్,భోజన వసతిని ఏర్పాటు చేసేందుకు నీరు ఎంతో అవసరం ఉండటంతో విద్యార్థులు స్నానాలు రెండు మూడు రోజులకు ఒకసారి స్నానాలు ఆచరించడం జరుగుతుందని విద్యార్థుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థినీలు మరింత అవస్థలు పడుతున్నట్లు సమాచారం. 2024 -25 సంవత్సరానికి గాను గత జిల్లా కలెక్టర్ విద్యార్థుల సమస్యలను గమనించి నిధులు మంజూరు చేసి బోరు వేసి మోటార్ నిర్మాణం గావించి పైప్ లైన్ ద్వారా పాఠశాలకు నీటిని సప్లై చేస్తున్న ఆ నీరు సక్రమంగా విద్యార్థులకు సరిపడా అందడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పాఠశాలకు మిషన్ భగీరథ నీరు వారం రోజులు గా రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్ బోరు నిర్మాణంలో తక్కువ లోతులో బోర్ వేసి,మోటర్ బిగించి బిల్లులు కాజేశారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు నీరు రోజు మౌలిక,ఇతర అవసరాలకు వంటలకు మాత్రం నీరు చేరడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలకు నీరు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థుల పేరెంట్స్ గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఏకలవ్య ప్రిన్సిపాల్ వివరణ కోసం ప్రయత్నం చేయగా వారి మొబైల్ ఇన్కమింగ్ సర్వీస్ అందుబాటులో లేదని తెలుస్తుంది.

# కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు కష్టపడాలి

## మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌కు ఘన సన్మానం

**ఎల్కతుర్తి/ జూన్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో నూతన మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌కు ఘనంగా సన్మానం నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు శీలం అనిల్ కుమార్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో భేదాభిప్రాయాలకు తావులేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తూ కార్యకర్తలకు అండగా నిలుస్తానన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, రానున్న





ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మండలంలోని ప్రతి గ్రామంలో త్వరలో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం సూచనల మేరకు కమిటీలను పూర్తి చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించేలా సమష్టిగా పనిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు శీలం అనిల్ కుమార్, గొడిశాల రాజయ్య, డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, శనిగరపు వెంకటేష్, గోలి రాజేశ్వరరావు, మాజీ సర్పంచులు గొడిశాల యాదగిరి, నల్లాల రాజిరెడ్డి, లోకిని సూరయ్య, బొజ్జ గోపాల్, యువ నాయకుడు గొడిశాల అర్జున్ గౌడ్, కోరే పున్నం, జనగాని లక్ష్మీనారాయణ, అంబాల జగన్, గొడిశాల వినయ్, ప్రదీప్, రమేష్, వెంకట్, యువరాజ్, నాగరాజు, ముదిరాజ్ సంఘం నాయకులు, రజక సంఘం నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే.



**బయ్యారం/,జూన్ 27.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ సర్ ప్రక్రియకు సంబంధించి ఇంటింటి సర్వేను శనివారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. బయ్యారం మండలంలోని జగ్గుతండ పంచాయతిలో సర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ ఫామ్స్ పంపిణీనీ పరిశీలించి బిఎల్ఓలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతో పాటు అనర్హులు,మృతులు,శాశ్వతంగా వలసవెళ్లిన వారు,ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా చేపట్టిన ఈ సర్ ప్రక్రియలో ప్రజలు చైతన్యవంతంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు,సీఐ రవీందర్,ప్రజాప్రతినిధులు, బిఎల్ఓలు,సూపర్వైజర్స్, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేటి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి.

## -మండల వైద్యాధికారి విజయ్ కుమార్.



**బయ్యారం/,జూన్ 27.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని అన్ని గ్రామాల్లో నేడు నిర్వహించే పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో 5 సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ రోజు పుట్టిన పిల్లల నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. మండల కేంద్రంలోని తొమ్మిది సెంటర్లలో పీహెచ్ సి,బయ్యారం జీపీ,చెక్ పోస్ట్,యునాని హాస్పిటల్,జగ్గుతండ జిపి,బస్ స్టాండ్ సెంటర్ ఇంకా మండల వ్యాప్తంగా గ్రామల్లో 13 సెంటర్లలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రేపటి నుంచి ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు,సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని డాక్టర్ విజ్ఞప్తి చేశారు.

# పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా జగన్ ఏకగ్రీవం

## ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఘన సత్కారం





**సికింద్రాబాద్/జూన్ 27(జర్నలిస్ట్ వార్త):** సికింద్రాబాద్ పద్మశాలి సంఘం నూతన అధ్యక్షుడిగా మందార జగన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని బీసీ కులాలకు తగిన గుర్తింపు కల్పించి, వారి అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. నూతన అధ్యక్షుడు మందార జగన్ మాట్లాడుతూ సంఘ నియమాలకు లోబడి, సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పనిచేస్తానని స్పష్టం చేశారు. సంఘానికి సంబంధించిన ఎలాంటి సమస్యలైనా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు తీగుళ్ళ రామేశ్వర్ గౌడ్, కిరణ్ గౌడ్, కిషోర్ గౌడ్, చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు చిక్క దేవదాసు. మాజీ కార్పొరేటర్లు కంది శైలజ శ్రీకాంత్, డాక్టర్ హేమ సామల, లింగాని లక్ష్మీ ప్రసన్న శ్రీనివాస్, కంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా అవకాశం ఇవ్వండి

## కోట శ్రీనివాస్ గుప్తా



**సికింద్రాబాద్/జూన్ 27(జర్నలిస్ట్ వార్త):** ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా అవకాశం కల్పించాలని ఆర్యవైశ్య సంఘం నాయకుడుకోట శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సామాజికవర్గ సమగ్ర అభివృద్ధి, పేద వర్గాల సంక్షేమమే తన ప్రధాన ధ్యేయమని శ్రీనివాస్ గుప్తా అన్నారు.

నామాలగుండులోని బిఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నేడు (ఆదివారం) నిర్వహించనున్న వారసిగూడ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో తాను అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కేవలం పదవుల కోసమే కాకుండా, సమాజసేవ దృక్పథంతోనే తాను బరిలో నిలిచానని, ఓటర్లు తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. తాను ఎన్నికైన వెంటనే సంఘంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పేద విద్యార్థులకు విద్యా ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని, మహిళలు, యువత స్వయం ఉపాధి సాధించేలా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. సంఘంలో దశాబ్దాలుగా ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. ఈ ఎన్నికలను ఒక పండుగలా భావించి, ఆర్యవైశ్య సంఘ నేతలు, సభ్యులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## వృద్ధులు, వికలాంగులకు అల్పాహారం పంపిణీ





**కల్లూరు/ జూన్ 27 (జర్నలిస్ట్ వార్త);**సమాజంలోని వృద్ధులు, వికలాంగులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ క్రీస్తు సంఘం మందిరంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రార్థన అనంతరం బ్రదర్ ఇశ్రాయేలు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు పాలు, బ్రెడ్‌తో కూడిన అల్పాహారంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బ్రదర్ ఇశ్రాయేలు మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అనే భావనతో అవసరమైన వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. భవిష్యత్తులోనూ నిరుపేదలు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమం కోసం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో దైవజనులు, గ్రామస్థులు, పాము తిమోతి తదితరులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

## ధర్మసాగర్ తహసీల్దార్‌కు బీజేపీ నేతల శుభాకాంక్షలు



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో జూన్ 27 (జర్నలిస్ట్ వార్త);** ధర్మసాగర్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బావూసింగ్‌ను శనివారం బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించి ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ మర్యాదపూర్వక సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, సీనియర్ నాయకుడు గంకిడి వెంకట్ రెడ్డి, జనగామ జిల్లా మీడియా కన్వీనర్ కాదుగాయ రాంగ్, మండల ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలి

**అధిక సంఖ్యలో రైతులు తరలిరావాలి -మొక్క శేఖర్ గౌడ్**



**తల్లాడ/జూన్ 27 (జర్నలిస్ట్ వార్త):** ఈనెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్తేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభకు గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొక్క శేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం తల్లాడ మండలం మల్లారం గ్రామంలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకే ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు హాజరుకానున్నారని చెప్పారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో ఒకేసారి జమ చేయనున్న నేపథ్యంలో రైతులు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తల్లాడ మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెర్రి కృష్ణారావు, వైరా మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతనిప్పు మాధవరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు గజ్జి సూర్యనారాయణ, సీతారామయ్య, కటిక గోపాలరావు, నరేంద్ర, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందలో గుడిసెల నివాసితుల గృహ సర్వే ముమ్మరం

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంపీడీఓ వెంకటరమణ**

**అర్హులైన ప్రతి నిరుపేదకూ ప్రభుత్వ ఫలాలు అందాలి- పారదర్శకంగా వివరాల నమోదుకు ఆదేశం**



**వర్ధన్నపేట/జూన్ 27( జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండల పరిధిలోని ఇల్లంద గ్రామ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న గుడిసెల నివాసితుల గృహ సర్వే కార్యక్రమం శనివారం ముమ్మరంగా సాగింది. ఈ సర్వే ప్రక్రియను మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటరమణ క్షేత్రస్థాయిలో సందర్శించి, స్వయంగా పరిశీలించారు. అధికారుల సర్వే తీరును పర్యవేక్షించిన ఆమె, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట రమణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి గుడిసె నివాసి వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. నిజమైన నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే ఈ సర్వే ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి శంకర్రావు ఆధ్వర్యంలో అధికారుల బృందం ప్రతి నివాసానికి వెళ్లి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల కుటుంబ వివరాలు, వారి ఆధార్, రేషన్ కార్డుల సమాచారాన్ని సిబ్బందితో కలిసి నమోదు చేయించారు. నిరుపేదల సమగ్ర సమాచారంతో కూడిన నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు వెల్లడించారు. ఈ క్షేత్రస్థాయి సర్వే పరిశీలన కార్యక్రమంలో స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పోలియో చుక్కలు వేయించడంలో నిర్లక్ష్యం వద్దు

**నేటి నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం**

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి చుక్కలు వేయించాలి.**

**వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష**



**తల్లాడ/జూన్ 27 (జర్నలిస్ట్ వార్త):** పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష పిలుపునిచ్చారు. ఆదివారం (జూన్ 28) నుంచి 30వ తేదీ వరకు మండలవ్యాప్తంగా మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక పోలియో బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తొలి రోజు బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయగా, అనంతర రెండు రోజులు ఇంటింటికీ వెళ్లి బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించి చుక్కలు వేస్తామని తెలిపారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ ప్రత్యూష కోరారు.

ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీధర్ రాజు, ఏపీవో కోటయ్య, ఈవో రేగల కృష్ణారావు, వైద్య సిబ్బంది, సూపర్వైజర్లు, నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గ్రామ దీపికలు పాల్గొన్నారు.

## విజయవంతంగా ముగిసిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

**తల్లాడ/జూన్ 27 (జర్నలిస్ట్ వార్త):**

మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో మూడు రోజులుగా నిర్వహించిన సీపీఎం డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు శనివారం విజయవంతంగా ముగిశాయి. చివరి రోజు పార్టీ నిర్మాణం ఆవశ్యకత, కర్తవ్యాలు అంశంపై సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు రాజకీయ పాఠాన్ని బోధించారు. డివిజన్ కార్యదర్శి సేలం సత్యనారాయణ రెడ్డి శిక్షణా తరగతులకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యవస్థల వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. ఆర్థిక సంక్షోభాల ప్రభావంతో ప్రజల జీవన ప్రమాణాలు క్షీణిస్తున్నాయని, ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం సోషలిస్టు విధానంలోనే ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సోషలిస్టు భావజాలానికి ఆదరణ పెరుగుతోందని చెప్పారు.






పార్టీ కార్యకర్తలు సిద్ధాంతపరమైన అవగాహనను మరింత పెంపొందించుకోవడంతో పాటు ప్రజల మధ్య విస్తృతంగా పనిచేయాలని సూచించారు. ప్రజా సమస్యలపై సిద్ధాంతబద్ధమైన పోరాటాలు నిర్వహిస్తూ శ్రామిక వర్గాన్ని ఐక్యం చేసే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణా తరగతుల్లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు, చలమాల విఠల్‌రావు, జాజిరి శ్రీనివాసరావు, డివిజన్ కమిటీ సభ్యులు అయినాల రామలింగేశ్వరరావు, కొలకపోగు సర్వేశ్వరరావు, తన్నీరు కృష్ణార్జున్‌రావు, జాజిరి జ్యోతి, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, సేలం పకీరమ్మ, మాదాల వెంకటేశ్వరరావు, అర్వపల్లి జగన్మోహన్‌రావు, గాయం తిరుపతిరావు, మిట్టపల్లి నాగమణి, సీనియర్ నాయకులు సాయిని ప్రకాశ్‌రావు, కళ్యాణపు కృష్ణయ్య, రాజబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

# బడిపిల్లలే లక్ష్యంగా వల.. సురక్ష తోనే అడ్డుకట్ట

**అక్రమ రవాణా, సోషల్ మీడియా ముప్పులపై విద్యార్థులకు అవగాహన - గీసుగొండ జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన సదస్సు**

**గీసుగొండ/జూన్ 27(జర్నలిస్ట్ వార్త):** అమాయక విద్యార్థులే లక్ష్యంగా సాగుతున్న మానవ అక్రమ రవాణాను అడ్డుకోవడానికి, సోషల్ మీడియా ముప్పుల నుంచి పిల్లలను రక్షించడానికే సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గీసుగొండ ఎస్సై అనిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు కె.సుభాష్ అధ్యక్షతన, మై ఛాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ ఇంటర్నెట్ ప్రపంచంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే సోషల్ మీడియా సందేశాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఎవరైనా వేధింపులకు గురిచేసినా, భయపెట్టినా తక్షణమే నమ్మకమైన వారికి చెప్పాలని, 1800 419 8588 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఫౌండేషన్ ప్రతినిధి







మహంతి మాట్లాడుతూ పేదరికం, బాల్యవివాహాలు, వైకల్యాన్ని ఆసరాగా చేసుకుని నగరాల్లో మంచి ఉద్యోగాలంటూ రిక్రూటర్లు మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. హెచ్ఎం సుభాష్ మాట్లాడుతూ అవగాహన లోపం వల్లే ఇలాంటి సమస్యలు వస్తాయని, విద్యార్థులు చదువుపైనే దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, అరుణశ్రీ, వెంకట్రావు, శీను, భాగ్యలక్ష్మి, రవీందర్, సుచరిత, కళ్యాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.25 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి



**ముదిగొండ/జూన్ 27 (జర్నలిస్ట్ వార్త ):** ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం బాణాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తమ్మిశెట్టి సురేష్ శనివారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చిన్న షెడ్ నిర్మాణానికి ఇంటి నంబర్, భవన నిర్మాణ అనుమతి మంజూరు చేసేందుకు రూ. 25 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఫిర్యాదు మేరకు రైతు వేదిక వద్ద బాధితుడి నుంచి రూ. 25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలి

**ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి**

**ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్**

**నర్సంపేట/జూన్ 27 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో శాస్త్రీయమైన విద్యా విధానంతో పాటు కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో కొనసాగుతున్న ఫీజుల దోపిడీని ప్రభుత్వం కట్టడి చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య) వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను రమేష్ డిమాండ్ చేశారు. శనివారం నర్సంపేట నియోజకవర్గంలోని చెన్నారావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.



రాష్ట్రంలో ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్య అందేలా కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై తీవ్ర ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. షూలు, బెల్టులు, యూనిఫాంలు, పుస్తకాలను పాఠశాలల నుంచే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చేశారని ఆరోపించారు. అనేక ప్రైవేట్ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని, ఇరుకైన గదుల్లో తరగతులు నిర్వహిస్తున్నారని అన్నారు. సరైన ఆటస్థలం, అగ్నిమాపక భద్రత, నిర్వహణ వంటి సౌకర్యాలు లేకపోయినా కొన్ని పాఠశాలలు కొనసాగుతున్నాయని, గుర్తింపు లేని విద్యాసంస్థలు కూడా పనిచేస్తున్నాయని మండిపడ్డారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, డీఈఓ, ఎంఈఓలు ప్రైవేట్ పాఠశాలలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా విద్యాలయాలకు తగిన నిధులు కేటాయించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

